క్లుప్తంగా

వెంకన్నకు మామిడి నివేదన


మామిడి పండ్లతో వెంకన్న

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని వారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, అనంతరం తోమాల సేవ, అష్టోత్తర నామార్చన, సహస్ర నామార్చన అనంతరం 1008 మామిడి ఫలాలతో స్వామిని పూజించారు. సాయంత్రం నవ హారతులతో దీపోత్సవం చేశారు. రాత్రి పవళింపు సేవ నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య


కోట్ల జగదీష్(ఫైల్)

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో అద్దెకు ఉంటున్న 23 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు విజయనగరం జిల్లా మల్లిచర్ల గ్రామానికి చెందిన కోట్ల జగదీష్(23)గా గుర్తించారు. జగదీష్ పెదముషిడివాడ గ్రామంలో నివాసం ఉంటూ ఎస్ఈజెడ్‌లోని ఈసాయి పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం ఇంట్లో సీలింగ్ ఫ్యాను హుక్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలసూర్యారావు చెప్పారు.

'ఉక్కు కార్మికులపై విద్యుత్ భారం సరికాదు'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న కార్మికుల క్వార్టర్ల విద్యుత్ చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించాలని స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా యాజమాన్యం కార్మికులపై అదనపు భారం మోపిందన్నారు.

తీరంలో అంధకారం



పర్యాటకుల అవస్థలు

పరవాడ: పర్యాటక ప్రాంతాలైన ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరంలో వసతులు కానరావడం లేదు. సాయంత్రం అయితే అంధకారం అలముకుంటోంది. దీంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలకు గాజువాక, అనకాపల్లి, యలమంచిలి ప్రాంతాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు వస్తారు. అయితే తీరంలో లైట్లు వెలగక పోవడంతో సాయంత్రం కాక ముందే వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిర్వహణ కరువు

సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్సార్‌లో భాగంగా ఐదేళ్ల కిందట లక్షలాది రూపాయలు



తిక్కవానిపాలెం తీరంలో వెలగని సోలార్ దీపాలు

వెచ్చించి రెండు తీర ప్రాంతాల్లో సుమారు 150 సోలార్ దీపాలు ఏర్పాటు చేసింది. సోలార్ లైట్లు రెండేళ్ల పాటు పని చేశాయి.దీంతో సముద్రఅందాలను తిలకించడానికి వచ్చే పర్యాటకులు చీకటి పడినా సోలార్ విద్యుత్ దీపాల వెలుగుల్లో సందడి చేసేవారు. కానీ పర్యాటకుల ఆనందం ఎంతో


ముత్యాలమ్మపాలెం తీరంలో ఉత్సవ విగ్రహాలుగా మారిన సోలార్ దీపాలు

కాలం నిలవలేదు. ప్రస్తుతం సోలార్ విద్యుత్ దీపాలు వెలగడం లేదు. ఫలితంగా పర్యాటకులతో పాటు స్థానిక మత్స్యకారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటు పంచాయతీ .. అటు ఎన్టీపీసీ యాజమాన్యం గాని పట్టించుకోవడం మానేశాయి.

స్తంభాలకు తుప్పుముప్పు

రెండు తీర ప్రాంతాల్లో నిర్మించిన ఐరన్ స్తంభాలు ఉప్పు గాలికి తుప్పు పట్టి ఎక్కడికక్కడ విరిగిపోతున్నాయి. స్తంభాలకు అమర్చిన సోలార్ ప్లేట్లు, ల్యాంపులు రాలిపోయాయి. మరికొన్ని సోలార్ ప్లేట్లు, ఇనుప స్తంభాలను స్థానికులు పట్టుకుపోతున్నారు. తీరంలో అంధకారం అలముకోవడంతో పర్యాటకుల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఎన్టీపీసీ యాజమాన్యం ముందుకొచ్చి ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో లైట్లు వేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

ప్లాంటేషన్ పనులకు ప్రాధాన్యం

ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ శివప్రసాద్

సబ్బవరం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్లాంటేషన్ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. మండలంలోని బాటజంగాలపాలెంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న మినీ అమృత సరోవర్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. సుమారు రూ.8.84 లక్షల ఉపాధి నిధులతో నీటి నిల్వకు సంబంధించి చేపడుతున్న ప్రాజెక్టు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీని ద్వారా వర్షపు నీటిని నిల్వచేసి వాటర్ హార్వెస్టింగ్ చేస్తే బోర్ల కింద పొలాలకు ఎటువంటి నీటి వనరుల కొరత లేకుండా పంటలను సమృద్ధిగా పండించుకోవచ్చని ఆయన సూచించారు. మండలంలో సుమారు 5 వేల మంది ఉపాధి కూలీలతో 50 వరకూ పారం పాండ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ఆయనకు వివరించారు.అదేవిధంగా కూలీలకు రూ.300 వరకూ వేతనం గిట్టుబాటు అయ్యేలా ప్రతీ రోజు ఉదయం 5 గంటల నుంచి 10 లేదా 1 గంటల వరకూ పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ. సందీప్, అనకాపల్లి క్లస్టర్ ఏపీడీ మణికుమార్, విశాఖపట్నం ఏపీడీ ఆంజినేయులు, ఎంపీడీవో రామ్మోహనరావు, ఏపీవో మల్ల శ్రీనివాసరావు, ఈసీ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


మినీ అమృత సరోవర్ పనులపై అధికారులకు సూచనలిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ శివప్రసాద్

పాఠశాలలు తెరిచేనాటికే పుస్తకాలు

అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ

సబ్బవరం: పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ చెప్పారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. పాఠశాలకు చేరిన విద్యాకానుక పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఆధునికీకరణ పనులను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.పాఠశాల ఆవరణలోని మండల శాఖ గ్రంథాలయాన్ని,అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి, గ్రంథాలయ అధికారి వి. శిరీషతో పాటు ఎంఆర్‌సీ సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.


సబ్బవరం ఎంపీపీ స్కూల్‌లో విద్యాకానుక పుస్తకాలను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మమ్మ

సందడిగా జాబ్ అచీవర్స్ డే


సత్కరిస్తున్న విస్తం కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: మండలంలోని పినగాడి విస్తం పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డే సందర్భంగా కళాశాలలో చదువుతూ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కొలువులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను శనివారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ కె.వి కిరణ్, సోషల్ వెల్ఫేర్ అధికారి సూర్యప్రకాష్, ప్లేస్‌మెంట్ అధికారి ఈ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి. అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటలాడుదాం


చిన్నారులతో అతిథులు


ఆటలాడుతున్న చిన్నారులు

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం చిన్నారులకు కథలు చదవడం, రాయడం, చెప్పడం నేర్పించారు. అనంతరం ధ్యానం చేయించారు. సరదాగా ఆటలు ఆడుదాం కార్యక్రమంలో భాగంగా పాసింగ్ బాల్ గేమ్ ఆడించారు. విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆడారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హెచ్ఆర్‌సీఐ వార్షికోత్సవం

సింహాచలం: మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా చూడడమే ధ్యేయంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా పని చేస్తుందని హెచ్ఆర్‌సీఐ తెలుగు రాష్ట్రాల జాతీయ అధికార ప్రతినిధి, కింగ్స్ ఆర్మీ విద్యాసంస్థల చైర్మన్ బ్రదర్ డెన్నీ తెలిపారు. హెచ్ఆర్‌సీఐ ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం 98వవార్డు బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించారు. డెన్నీ మాట్లాడుతూ మానవ సంబంధాల విలువను చాటిచెబుతూ, వారి హక్కులను కాపాడడానికి హెచ్ఆర్‌సీఐ కృషి చేస్తుందన్నారు. అలాగే హెచ్ఆర్‌సీఐ సేవా కార్యక్రమాల్లో కూడా సభ్యులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రెండేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజాన్ని చైతన్య పరుస్తున్న పలువురిని సన్మానించారు. జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నందం నరసింహారావు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.